
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY




సర్దార్‌నగర్‌లో పల్లె ప్రకృతి వనం వద్ద తమిళనాడు బృందం

పంచాయతీల పనితీరు భేష్

షాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పంచాయతీల పనితీరు బాగుందని తమిళనాడు సర్పంచ్‌లు, బ్లాక్ అధ్యక్షులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులు కితాబిచ్చారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ శిక్షణ బృందం సభ్యులు అనిల్‌కుమార్, వెంకటరమణ గురువారం మండల పరిధిలోని సర్దార్‌నగర్‌లో పర్యటించారు. గ్రామ పంచాయతీ భవనం, గ్రంథాలయం, వైకుంఠధామం, పల్లె ప్రకృతివనం, డంపింగ్‌యార్డు, క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. చాలా బాగున్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటర్ లిస్టులో తప్పులను గుర్తించాలి

కొత్తూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఓటర్ లిస్టులో తప్పులను బీఎల్‌వో(బూత్ లెవల్ ఆఫీసర్)లు గుర్తించి సరి చేయాలని షాద్‌నగర్ ఆర్డీవో ఎస్ ఆర్ సరిత అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన బీఎల్‌వోల శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఓటర్ లిస్టులో నమోదు అంశాలతోపాటు, తప్పు ఒప్పుల సవరణ, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్పు, తదితర అంశాలపై సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, డీఎల్‌ఎంటీ ఇమాన్యుయేల్, ఎలక్షన్ డీటీ బాలవర్ధన్, నాయబ్ తహసీల్దార్ జంగయ్య పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మహేశ్వరంలో గురువారం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కంపెనీ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచంతో పోటీపడేలా 30 వేల ఎకరాల విస్తీర్ణంలో అధునాతన నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. సింగపూర్ లాంటి దేశాలకు చెందిన అత్యుత్తమ కన్సల్టెంట్స్‌తో చర్చిస్తున్నట్లు వివరించారు. పెట్టుబడులను ఆకర్షించే విధంగా అభివృద్ధి ఉంటుందన్నారు.



పరిశ్రమలో ప్రదర్శనకు ఉంచిన ఆభరణాలను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మహానగరంలా మహేశ్వరం

30 వేల ఎకరాల్లో నిర్మాణం

- మనకు ప్రపంచంతోనే పోటీ
- ఫ్యూచర్ సిటీ ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళికలు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ పరిశ్రమ ప్రారంభం
- సీఎంకు ఘన స్వాగతం పలికిన మంత్రులు, ఎమ్మెల్యేలు

రంగారెడ్డి అర్బన్/మహేశ్వరం, జూలై 3(ఆంధ్రజ్యోతి): త్వరలోనే మహేశ్వరం మహానగరంగా మారనుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో గురువారం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కంపెనీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మలబార్ గోల్డ్ పరిశ్రమలో తయారు చేసిన ఆభరణాలను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ నిర్మలాజగ్గారెడ్డితో కలిసి పరిశీలించారు. వీరి వెంట ఐఏఎస్ సంజయ్‌కుమార్, మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహమ్మద్, ఆపరేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆషర్‌వో, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏకే నిషాద్ ఉన్నారు. కంపెనీలో తయారు చేసిన పలు రకాల బంగారు నగలను చైర్మన్ ముఖ్యమంత్రికి చూపించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ మహేశ్వరం ప్రాంతాన్ని నాలుగో నగరంగా, భారత్ ఫ్యూచర్ సిటీగా మార్చేందుకు ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఒకప్పుడు కులీ కుతుబ్‌షా హైదరాబాద్ నగరాన్ని నిర్మిస్తే.. ఆ తర్వాత నిజాం నవాబులు హైదరాబాద్, సికింద్రాబాద్‌లను నిర్మించారన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌డ్డి సైబరాబాద్‌ను నిర్మించారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం

మిగతా 6వ పేజీలో...

సీఎంకు గజమాలతో ఘన స్వాగతం

మలబార్ గోల్డ్ పరిశ్రమను ప్రారంభించేందుకు మహేశ్వరం వచ్చిన సీఎం రేవంత్‌డ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను తుక్కుగూడలో మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, పార్టీ సీనియర్ నేత దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు సీఎం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికలు ఏవైనా విజయం మనదే కావాలని పిలుపునిచ్చారు. మహేశ్వరంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, అందుకోసం తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. సీఎంకు స్వాగతం పలికిన వారిలో పార్టీ సీనియర్ నేతలు ఏనుగు జంగారెడ్డి, కప్పాటి పాండు రంగారెడ్డి, నడికూడ శివ తదితరులు ఉన్నారు.



మలబార్ గోల్డ్ కంపెనీ ప్రారంభోత్సవంలో ప్రతినిధులు



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో సింగరేణితో ఒప్పందం చేసుకుంటున్న హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ డైరెక్టర్ సంజయ్ సైగల్

బొగ్గు గనుల్లో హరిత విప్లవం

- పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్/నందిగామ జూలై 3(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా బొగ్గుతీసి నిరుపయోగంగా వదిలేసిన గనుల్లో పచ్చదనాన్ని పెంచి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. నందిగామ మండల పరిధిలోని కన్హాశాంతి వనంలో గురువారం బొగ్గు, గనుల శాఖలకు సంబంధించిన సలహా సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి కిషన్‌రెడ్డితోపాటు సహాయ మంత్రి సతీష్ చంద్ర దుబే, గనులశాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు, కోలిండియా చైర్మన్ పీఎం ప్రసాద్, సింగరేణి సీఎండీ బల్‌రాంనాయక్, పలువురు సీఎండీలు హాజరయ్యారు. మైన్ క్లోజర్, మినరల్స్ ఉత్పత్తిపై సమీక్ష నిర్వహించారు. నిరుపయోగ గనులను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి శ్రీ రామచంద్రమిషన్ హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని, సలహాలను తీసుకోవాలని నిర్ణయించారు. మంత్రుల సమక్షంలో కోల్ ఇండియా, సింగరేణి సంస్థలతో రాంచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ మేరకు కోల్ ఇండియా లిమిటెడ్ టెక్నికల్ డైరెక్టర్ అచ్యుత్ ఘటక్, సింగరేణి సీఎండీ బల్‌రాంనాయక్‌లతో సంస్థ డైరెక్టర్ సంజయ్ సైగల్ ఒప్పందపత్రాలపై సంతకాలు చేసి, మార్చుకున్నారు.

నిరుపయోగంగా 143 బొగ్గు గనులు

మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో నిరుపయోగంగా విదిలేసిన బొగ్గు గనులు 143 ఉన్నాయని తెలిపారు. కన్హాశాంతి వనంలో ఈ సంస్థ 1,300 ఎకరాల్లో పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలను నాటి అభివృద్ధి చేసిందని చెప్పారు. ఇదే తరహాలో కోల్ ఇండియా, సింగరేణి సంస్థల్లోని క్లోజర్ మైన్స్‌ల్లో పచ్చదనాన్ని పెంచి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

బొగ్గు ఉత్పత్తులను కాపాడుతూ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. గనుల్లో ప్రమాదాలు జరుగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, కార్మికులకు ఇస్తున్న బీమాను పెంచుతున్నట్టు తెలిపారు. అనంతరం హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ డైరెక్టర్ సంజయ్ సైగల్ మాట్లాడుతూ కన్హాశాంతి వనంలోని వృక్ష సంపదను ప్రధాని మోదీ పరిశీలించారని తెలిపారు. క్లోజర్ మైన్స్‌ల్లో కూడా పచ్చదనాన్ని పెంచేందుకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నాయని తెలిపారు. ఒప్పందం ప్రకారం కోల్ ఇండియా, సింగరేణి సంస్థల క్లోజర్ మైన్స్‌ల్లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం

ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, సహాయ మంత్రి సతీష్‌చంద్ర దూబేలను శ్రీ రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ డైరెక్టర్ సంజయ్ సైగల్‌తో పాటు సింగరేణి సీఎండీ బలరామ్‌నాయక్ సన్మానించారు. ఈ సందర్భంగా సలహా మండలి సభ్యుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గ్రానైట్లపై మంత్రుల ఫొటోలతో తయారు చేయించిన జ్ఞాపికలను బలరామ్‌నాయక్ బహూకరించారు.

సమస్యల వెంబడి

వరండాలో చదువులు.. ఇరుకు గదుల్లో వంటలు

- సర్కారు బడుల్లో తప్పని తిప్పలు
- నత్తనడకన అదనపు గదుల నిర్మాణం
- నిలిచిపోయిన ఉర్దూ మీడియం పాఠశాల భవన నిర్మాణ పనులు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

నందిగామ, జూలై 3(ఆంధ్రజ్యోతి): కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య, వసతులు కల్పిస్తున్నామన్న పాలకులు, అధికారుల ప్రకటనలు ప్రచారాలకే పరిమితమవుతున్నాయి. నందిగామ మండల పరిధిలోని చాలా పాఠశాలలను అదనపు గదుల కొరత వెంటాడుతోంది. మధ్యాహ్న భోజన నిర్వాహణకు పక్కా భవనాలు లేవు. ఉన్నా ఆ గదులు సరిగా లేక ఇటు నిర్వాహకులు, అటు విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక పాఠశాలల్లో కనీస సౌకర్యాలు సైతం కానరావడం లేదు. దీంతో విద్యార్థులు సమస్యలతో సావాసం చేస్తూ విద్యనభ్యసిస్తున్నారు. నందిగామ మండల పరిధిలో ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మూడు ప్రాథమికోన్నత పాఠశాలలు, 28 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 1,883 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మండలంలోని

మిగతా 8వ పేజీలో...

వరండాలో నందిగామ ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులు



పాఠశాలల్లో వసతులు కల్పించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలి. సర్కారు బడుల్లో పేద పిల్లలు చదువుకుంటున్నారు. వారికి అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు పాఠ్యపుస్తకాలు, యూనీఫాం, షూస్ అందించాలి.

- పానుగంటి పర్వతాలు, ఏఐటీయూసీ నాయకుడు

సమస్యలు పరిష్కరిస్తున్నాం



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాం. అదనపు భవనాలు, అర్థాంతరంగా నిలిచిపోయిన పనులు, వంట గదుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తూ నాణ్యమైన విద్యనందిస్తున్నాం.

- శ్రీనివాసరావు, ఎంఈవో, నందిగామ

సమ్మెను జయప్రదం చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

మొయినాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించ తలపెట్టిన కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి పిలుపునిచ్చారు. గురువారం మొయినాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చాక కార్మికులపై, రైతులపై దాడి మొదలైందని ఆరోపించారు. కార్మికులకు అన్యాయం చేస్తున్నామరని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రవేటుపరం చేస్తూ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎండీ మక్బూల్, కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు బోనాల ప్రభాకర్, నరసింహ, పాండు, తదితరులు పాల్గొన్నారు.



మేడిపల్లిలో నినాదాలు చేస్తున్న రైతులు, నాయకులు

ఫార్మాసిటీ రద్దయ్యే వరకు పోరాడుతాం

- రైతులు, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు
- కుర్మిద్ద నుంచి మేడిపల్లి వరకు పాదయాత్ర

యాచారం, జూలై 3(ఆంధ్రజ్యోతి): విషం చిమ్మే ఫార్మాసిటీని రద్దు చేసేవరకు పోరాటం కొనసాగిస్తామని, ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన మాటను నిలుపుకోవాలని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి డిమాండ్ చేశారు. ఫార్మాసిటీని రద్దు చేయాలని, నిషేధిత జాబితాలో ఉన్న 2,500 ఎకరాల భూములను రైతుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరుతూ రైతులతో కలిసి కుర్మిద్ద నుంచి మేడిపల్లి వరకు పాదయాత్ర చేశారు. అనంతరం మేడిపల్లిలో ఆమె మాట్లాడారు. ఫార్మాసిటీ రద్దు చేస్తామని కాంగ్రెస్ మాట ఇచ్చి, అధికారంలోకి రాగానే రద్దు చేయలేదని ఆరోపించారు. ముందు ఫార్మాసిటీని రద్దు చేసి నిషేధిత జాబితాలోని పట్టాభూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే రోడ్డు పేరిట, ఫ్యూచర్ సిటీ పేరిట పేదల భూములు లాక్కుంటున్నారన్నారు. త్వరలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఫార్మాసిటీకి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన దిమ్మె వద్ద ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డిలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల మాజీ సర్పంచ్‌లు రమేష్, రాజశేఖర్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌నాయక్, నిరంజన్ తదితరులున్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణ రెడ్డి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నారాయణ రెడ్డి

ఆమనగల్లు, జూలై 3(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల, కల్వకుర్తి, వెల్దండ మండలాల పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల అధికారులతో గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా ఆయా శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో చేపట్టి నిలిచిపోయిన అన్ని పనులు వెంటనే ప్రారంభించి గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కల్వకుర్తి నియోజకవర్గానికి సీఎం రేవంత్ రెడ్డి రోడ్ల నిర్మాణం, విస్తరణ, ఆధునీకరణకు రూ.600 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈజీఎస్ ద్వారా మంజూరైన పంచాయతీ భవనాల నిర్మాణాలు స్థానికులతో కలిసి చేపట్టాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకనుగుణంగా అదనపు గదులు, మూత్రశాలలు, మరుగు దొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఈఈలు విజయ్, సుదర్శన్‌రెడ్డి, డీఈఈలు బసవలింగం, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌సింగ్, సత్యనారాయణ, ఏఈలు పరమేశ్, కృష్ణయ్య, అభిషేక్, ఉన్నారు.



చేగూర్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రవాణా కష్టాలు తీరుస్తాం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని స్టేషన్ తిమ్మాపూర్ నుంచి చేగూర్ రోడ్డును కలిపేందుకు సీసీ రోడ్డు నిర్మించి రవాణా కష్టాలు తీరుస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీలోని స్టేషన్ తిమ్మాపూర్ నుంచి చేగూర్ రోడ్డు వరకు ఉన్న మట్టి రోడ్డును గురువారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టేషన్ తిమ్మాపూర్ నుంచి చేగూర్ రోడ్డుకు వెళ్లాలంటే దూరం ఎక్కువై సమయం వృథా అవుతుందని మాజీ సర్పంచ్ ఏనుగు జనార్దన్‌రెడ్డి తన దృష్టికి తీసుకువచ్చాడన్నారు. స్టేషన్ తిమ్మాపూర్ రోడ్డులో రైతు వేదికతో పాటు, రైల్వే స్టేషన్ ఉందని, చేగూర్ రోడ్డులోని పలు కాలనీల ప్రజలు ఇక్కడకు రావాలంటే తిరిగి రావాల్సి వస్తుందన్నారు. త్వరలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రాజేందర్‌గౌడ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, నాయకులు కూన శివకుమార్‌గౌడ్, పాశం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో తస్మాత్ జాగ్రత్త

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, జూలై 3(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం చేవెళ్లలోని క్యాంపు కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులను అరికట్టవచ్చారు. రైతు రుణమాఫీ, రైతు భరోసాపై ఆరా తీశారు. ప్రభుత్వం ఉచితంగా అందించే విత్తనాలను రైతులకు చేరవేయాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను ప్రారంభించేలా చూడాలన్నారు. అధికారులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం జాతీయ ఆహార భద్రతా మిషన్ కింద రైతులకు ఉచితంగా కంది విత్తనాలను పంపిణీ చేశారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మహానగరంలా మహేశ్వరం

(ఐదో పేజీ తరువాయి)

మహేశ్వరం నియోజకవర్గంలో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని ప్రపంచానికి అందించబోతుందని చెప్పారు. ప్రపంచంతోనే పోటీపడేలా అధునాతన నగరాన్ని నిర్మిస్తున్నామన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని ముచ్చర్ల బేగరకంచెలో ఓ గొప్ప నగరాన్ని నిర్మించేందుకు సింగాపూర్, తదితర దేశాలకు సంబంధించిన కన్సల్టెంట్స్‌తో ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కొత్తగా ప్రారంభించిన మలబార్ జెమ్స్ అండ్ జ్యువెల్లరీ తయారీ యూనిట్ మహేశ్వరం ప్రాంతానికి రావడం సంతోషంగా ఉందన్నారు.

3.45 లక్షల చదరపు అడుగుల్లో..

మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎంపీ అహమ్మద్ మాట్లాడుతూ మహేశ్వరంలో 3.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటిగ్రేటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2,750మందికిపైగా కళాప్రావీణ్యం కలిగిన స్వర్ణకారులు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, అభివృద్ధి కలిగిన ఈ యూనిట్ ప్రపంచ వ్యాప్తంగా రిటైల్ విస్తరణకు దోహదం చేస్తుందన్నారు. అనంతరం ఆపరేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆషర్‌వో మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 22 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌ను విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏకే నిషాద్ మాట్లాడుతూ తమ కంపెనీ తయారీ యూనిట్‌లో అధునాతన ఆర్అండ్‌డీ కేంద్రాలు ఉన్నట్లు చెప్పారు. యూఎస్ఏ, జర్మనీ, ఇటలీ, టర్కీ నుంచి దిగుమతి చేసుకున్న యంత్రాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలం కబ్జా!

● **3,878 గజాలు అక్రమంగా అమ్మకం**

ఘట్‌కేసర్ రూరల్, జూలై3(ఆంధ్రజ్యోతి): లేఅవుట్లలో పార్కు, ఆట, స్కూల్, కమ్యూనిటీ భవనాల కోసం వదిలిన స్థలాలు కబ్జాల పాలవుతున్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అవుశాపూర్ పరిధిలోని సర్వే నంబర్లు 303, 304, 305, 306, 307లలో 43ఎకరాలను 1969లో 2001లో వినూత్న హైట్స్ పేరుతో 530 ప్లాట్లు చేసి విక్రయించారు. లేఅవుట్ నిబంధనల మేరకు పార్కు, స్కూల్, కమ్యూనిటీ హాళ్లకు 3,878గజాల స్థలాన్ని వదిలారు. 25సంవత్సరాల తర్వాత ఈ లేఅవుట్‌లోని ఖాళీ స్థలాలకు వెంచర్ నిర్వాహకులు సురేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డిలు హద్దులుపాతి విక్రయించుకుంటున్నారు. మునిసిపాలిటీ స్థలాన్ని విక్రయిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కాగా ఈ స్థలాన్ని వెంచర్ నిర్వాహకులే తిరిగి ప్లాట్లుగా అమ్మేస్తున్నారని, అధికారులు ఇప్పటికైనా దీనిపై చర్యలు తీసుకోవాలని కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి కోరారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని అవుశాపూర్ మాజీ సర్పంచ్ ఐలయ్యయాదవ్ అధికారులను కోరారు.



వినూత్న హైట్స్ అలేవుట్ స్థలంలో పాతిన హద్దురాళ్లు



పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న పాపయ్య

బిల్లులు ఇప్పించండి మహాప్రభో!

పాఠశాలకు తాళం వేసి నిరసన

మర్పల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాల అభివృద్ధి పనులకు ఖర్చు చేసిన బిల్లులు మంజూరు కాలేదని పాఠశాల మాజీ ఛైర్మన్ పాపయ్య గురువారం ఆ స్కూల్‌కు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని కొత్లపూరం గ్రామానికి చెందిన ఎస్ఎంసీ ఛైర్మన్ పరిగి పాపయ్య బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా తరగతి గదుల నిర్మాణం, విద్యుత్ మరమ్మతులు, తాగునీటి సౌకర్యం తదితర పనులు చేయించాడు. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా అప్పు చేసి పనులు పూర్తి చేశాడు. అధికారులు రూ. 4.05 లక్షలు ఖర్చు అయినట్లు ఎంబీ రికార్డు చేశారు. కానీ ఏళ్లు గడుస్తున్నా బిల్లులు మాత్రం రావడం లేదు. దీంతో విసుగుచెందిన పాపయ్య గురువారం పాఠశాలకు తాళం వేసి నిరసన తెలిపాడు. విషయం తెలుసుకున్న ఎంఈవో పోలీసులతో అక్కడికి చేరుకొని ఆయనను సముదాయించారు. గతేడాది పాఠశాలకు తాళం వేస్తే ఇదే మాదిరిగా నెల రోజుల్లో బిల్లులు ఇప్పిస్తామని హామీ ఇచ్చినట్లు పాపయ్య గుర్తు చేశాడు. ఎంత చెప్పినా వినకపోవడంతో పోలీసులు పాపయ్యను అదుపులోకి తీసుకొని మర్పల్లి స్టేషన్‌కు తరలించారు. అనంతరం నచ్చజెప్పి పంపినట్లు తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జేడీ రాజేందర్‌సింగ్

లక్ష్య సాధనతో అభ్యసించాలి

దౌల్తాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధనతో చదవాలని ఉన్నత విద్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేందర్‌సింగ్ అన్నారు. గురువారం దౌల్తాబాద్ జిల్లాపరిషత్ పాఠశాలలో ప్రేరణ తరగతులకు ఆయనహాజరై మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కుదూరంగా ఉండాలని ఉండాలని, తల్లిదండ్రుల ఆశయ సాధనకు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఒక వ్యక్తి వ్యక్తిత్వ వికాసానికి, సమాజంలో వారి ఉన్నతికి దోహదం చేస్తుందన్నారు.

సదుపాయాల కల్పనకు కృషి

కళాశాల అభివృద్ధి, విద్యార్థులకు సదుపాయాలను కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. దౌల్తాబాద్‌లోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. కళాశాలలో బోధనకు 12మంది అధ్యాపకులను నియమించినట్లు తెలిపారు. అనంతరం తెలంగాణ డిగ్రీ కళాశాలల సంయుక్త కార్యదర్శి డాక్టర్ రాజేందర్‌సింగ్ మాట్లాడుతూ... ప్రభుత్వ కాలేజీల్లో చదివిన విద్యార్థులు ఎంతో మంది నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీహరిరెడ్డి, రిటైర్డ్ ఎంఈవో బాబుసింగ్, ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహనుండాలి

తాండూరు రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఐనెల్లి మోడల్ స్కూల్‌లో బాల్య వివాహాలు, పోక్సో చట్టం, మహిళల భద్రత తదితరాంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసినా, సహకరించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఆపద సమయాల్లో 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.కార్యక్రమంలోఐనెల్లి రూరల్ సీఐ నగేష్, ఎస్సై విఠల్‌రెడ్డి, షీటీం ఇన్‌చార్జి రోజా, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలమూరు అధ్యయన వేదిక పోస్టర్ ఆవిష్కరణ

బొంరాస్‌పేట్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 5న హైదరాబాద్‌లోని దొడ్డి కొమురయ్య హాల్‌లో నిర్వహించే సదస్సు పోస్టర్‌ను గురువారం బొంరా స్పేట్‌లో ఆవిష్కరించారు. వేదిక నాయకులు మాట్లాడుతూ'ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా శాశ్వత వెనకబాటు' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జాతీయ పథకంగా ప్రకటించాలన్నారు. రేపటి సదస్సుకు కవులు, కళాకారులు, మేధావులు, విద్యావంతులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వేదిక నాయకులు చంద్రశేఖరఖ్, అనిల్, శివరాజ్, కేవీపీఎస్ నాయకులు వెంకటయ్య, రామకృష్ణ, మల్లప్ప పాల్గొన్నారు.

ఎర్రవల్లిలో షూటింగ్ సందడి



ఎల్లమ్మ ఆలయ ఆవరణలో షూటింగ్

వికారాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవల్లి షూటింగ్ స్పాట్‌గా మారుతోంది. గ్రామంలో కొత్తగా నిర్మించిన నాగుల ఎల్లమ్మ ఆలయపరిసరాలు ఆహ్లాదకరంగా ఉండడంతో సినిమా షూటింగ్‌లకు అనుకూలంగా మారింది. గురువారం ఓ ప్రైవేటు ఆల్బం పాటను చిత్రీకరించారు. గ్రామస్తులు, సమీప గ్రామాల ప్రజలు షూటింగ్ చూసేందుకు తరలివచ్చారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటుదాం



మాట్లాడుతున్న మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, జూలై 3(ఆంధ్రజ్యోతి): కష్టపడే కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలుపొంది పార్టీ సత్తా చాటుదామని కాంగ్రెస్ రాష్ట్ర యువ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఇబ్రహీంపట్నంలోని శాస్త్రా గార్డెన్స్‌లో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల తర్వాత ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ జెండా ఎగిరిందని, కష్టకాలంలో పార్టీకి వెన్నంటి ఉన్న కార్యకర్తలకు మండల, మున్సిపల్ ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించాలని నాయకత్వం నిర్ణయించిందన్నారు. నేడు(శుక్రవారం) నగరంలోని ఎల్బీ స్టేడియంలో జిల్లా, బ్లాక్, మండల, మున్సిపల్ అధ్యక్షులతో జరిగే బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నందున సభ విజయవంతానికి కృషి చేద్దామన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికలను దిగ్విజయంగా ముగించుకుందామన్నారు. ఏ-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదుల్ల పాండురంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ నాయకులు రాచర్ల వెంకటేశ్వర్లు, బి.మహిపాల్, కొంగరి విష్ణువర్ధన్‌రెడ్డి, కె.అమృతాసాగర్, బిలకంటి శేఖర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు జయమ్మ, మండలాధ్యక్షులు రవీందర్‌రెడ్డి, నర్సింహ, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌తో పట్టుబడితే
యాజమాన్యాలపై కేసులు

● **మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి**

మొయినాబాద్ రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): నగర శివారు మొయినాబాద్ ప్రాంతంలో అనేక ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలు ఉన్నాయని, వాటిలో చదివే విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వాడినట్లుయితే వారితో పాటు విద్యాసంస్థల యాజమాన్యాలపైనా కేసులు నమోదు చేస్తామని మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ ఉపయోగిస్తున్నట్లయితే సమాచారమివ్వాలని సూచించారు.

సీఎం, పీసీసీ చీఫ్‌కు ఘన స్వాగతం



సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న జంగారెడ్డి

కందుకూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): మహేశ్వరంలో మలబార్ గోల్డ్ పరిశ్రమ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లను పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి ఘనంగా సన్మానించారు. పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ ఎస్.కృష్ణానాయక్‌లతో కలిసి ఏనుగు జంగారెడ్డి తుక్కుగూడలో గజమాలతో వారిని సన్మానించారు. మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తదితరులున్నారు. కాగా, సీఎం మహేశ్వరం మండలంలో పర్యటించడంతో నాయకులు భారీగా తరలివెళ్లారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మహేందర్ తదితరులు

పాత బస్టాండు మీదుగా సిటీ బస్సులు నడపాలి

ఇబ్రహీంపట్నం, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పాత బస్టాండుకు ఆర్టీసీ సిటీ బస్సులు వచ్చేలా చూడాలని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల మహేందర్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్టీసీ అధికారులకు వినతిపత్రమందజేశారు. విద్యార్థులు, వృద్ధులు, మహిళలను దృష్టిలో పెట్టుకొని గతంలో మాదిరి సిటీ బస్సులను నడపాలన్నారు. ఇబ్రహీంపట్నం-శేరిగూడల మధ్య చెరువు కట్టకిరువైపులా చెట్లు చొచ్చుకొచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని తొలగించాలని మహేందర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డికి వినతి పత్రమిచ్చారు. రాఘవేందర్, శ్రీను, సంతోష్, అనిల్, విజయ్‌నాయక్, గోవర్ధన్‌లున్నారు.

సీజీఆర్ సేవలు అమోఘం

కందుకూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): నేదునూరు ఆదర్శ పాఠశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవలు అభినందనీయమని ప్రిన్సిపాల్ విష్ణుప్రియ అన్నారు. గురువారం పాఠశాలలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్, ఔషధ మొక్కల పెంపకం కొరకు జేసీబీతో స్కూల్ ఆవరణలో స్థలాన్ని చదును చేయించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ పట్టణాభివృద్ధికి రూ.39.72 కోట్లు మంజూరు


మాట్లాడుతున్న బాబర్‌ఖాన్

షాద్‌నగర్, జూలై 3(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.39.72 కోట్లు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ తెలిపారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 28 వార్డులను అభివృద్ధి పర్చేందుకు గాను నిధులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా గురువారం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈనెల 5న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. సీనియర్ నేతలు రఘు. అగ్గనూరు విశ్వం, ఇబ్రహీం, కొంకళ్ల చెన్నయ్య. బాలరాజ్‌గౌడ్, ముబారక్, జాంగారి రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఆదిభట్ల, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పండల లక్ష్మీపతిగౌడ్ అన్నారు. గురువారం ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్‌కు చెందిన బీజేపీ నాయకులు ఉడుతల అశోక్‌గౌడ్, గోదాసు అనంతరాజ్ సొంత డబ్బుతో కొనుగోలు చేసిన టై, బెల్టులను ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల బలోపేతానికి దాతలు ముందుకు రావాలని కోరారు. బీజేపీ నాయకులు వెంకటరెడ్డి, రాములు, నర్సింహ, శ్రీకాంత్, సంతోష్, రమేష్, రాఘవేందర్‌గౌడ్, టీచర్లు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

చేవెళ్ల, జూలై 3(ఆంధ్రజ్యోతి): హాస్టల్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, వీరభద్ర ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ లైసెన్సును రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ కోరారు. గురువారం చేవెళ్లలో యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేవెళ్ల డివిజన్‌లో ప్రభుత్వ హాస్టల్‌లో పనిచేస్తున్న వర్కర్లకు 8 నెలల నుంచి జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

మంచాల, జూలై 3(ఆంధ్రజ్యోతి): మంచాల జెడ్పీహైస్కూల్‌లో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నగరంలోని సాధూరాం కంటి ఆసుపత్రికి చెందిన డా.ఎం.ఎస్ రెడ్డి, డా.భగవాన్ యాదగిరిలు విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. వైద్యుల సూచన మేరకు కంటి చూపు సమస్య ఉన్నవారికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తామని గోగిరెడ్డి లచ్చిరెడ్డి, డా.భిక్షపతి తెలిపారు. మండల విద్యాధికారి రాందాస్, హెచ్ఎం తుల్జారాం, ఝాన్సీ రుబియానా, క్యాంప్ కో-ఆర్డినేటర్లు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



మాడ్గుల, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సిద్దమోని శంకరయ్య అనారోగ్యానికి గురై ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. ఈమేరకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో మంజూరైన రూ.46వేల చెక్కును గురువారం శంకరయ్య కుమారుడు నరేష్‌కు అందచేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కిషన్‌రెడ్డి నూదిని కొండల్‌రెడ్డి తదితరులున్నారు.

ఖర్గే సభను విజయవంతం చేయాలి


షాబాద్ : సమావేశంలో మాట్లాడుతున్న భీంభరత్

ఆమనగల్లు, జూలై 3(ఆంధ్రజ్యోతి): జైబాపు.. జైభీం.. జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో 15వేల మంది కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులతో సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరయ్యే ఖర్గే సభ విజయవంతంపై గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆమనగల్లు, కల్వకుర్తి, కడ్తాల, వెల్దండ, మాడ్గుల, తలకొండపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి సంధ్యారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ఖర్గే సభ విజయవంతం, ప్రభుత్వ పథకాల అమలు గూర్చి చర్చించారు. పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, యాట నర్సింహ, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు కిషన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మోతిలాల్, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, జగన్, మానయ్య, బీచ్యనాయక్, నాయకులు పాల్గొన్నారు.

షాబాద్ : నేడు(శుక్రవారం) నగరంలో నిర్వహించే కాంగ్రెస్ సమ్మేళన సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ తెలిపారు. షాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమ్మేళన సభను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మల్లేష్, సీనియర్ నాయకులు రాంరెడ్డి, మాధవరెడ్డి, రవీందర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, నాయకులున్నారు.

మొయినాబాద్ రూరల్ : కాంగ్రెస్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మండలాధ్యక్షుడు తమ్మళి మాణయ్య పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం ప్రకటనలో కోరారు. సభలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఖర్గే దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.

కొత్తూర్ : ఖర్గే బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని మున్సిపల్ శాఖ అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్, మండల శాఖ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. ఈమేరకు వారు ప్రకటనలో కోరారు.

కేశంపేట : ఎల్బీ స్టేడియంలో నేడు నిర్వహించే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ కేశంపేట మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండె రాణి, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిప్పళ్ల శ్రీనాథ్‌లు సంయుక్త ప్రకటనలో కోరారు. అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు.

'బండ్లబాటను కబ్జా చేసిన బడాబాబులు'

రంగారెడ్డి అర్బన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : బడాబాబులు బండ్ల బాటను కబ్జాకు గురిచేశారని బాలాజీ ఓడీఎఫ్(డిఫెన్స్) కాలనీ సింగాపురం అధ్యక్షుడు ఎంఈవీ ప్రసాద్ ఆరోపించారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ శంకర్‌పల్లి మండలం సింగాపురం నుంచి శంకర్‌పల్లి ఓడీఎఫ్ దారిని కలుపుతూ బండ్లబాట ఉండేదని తెలిపారు. ఆ బాటకు పక్కన సర్వేనెంబర్ 52లో 1983లో గ్రామ పంచాయతీ ద్వారా అనుమతి పొందిన లేఔట్‌లో 30 అడుగుల దారి ఉందని చెప్పారు. అలాగే సర్వేనెంబర్ 51లో ఓడీఎఫ్ ఉద్యోగులు 3.08 ఎకరాల భూమిని 1989, 1990లో కొనుగోలు చేసి 58 పాట్లతో లేఔట్ చేసుకున్నట్లు చెప్పారు. సర్వేనెంబర్ 52నుంచి వచ్చిన 30 అడుగుల దారిని కలపుతూ తమ లేఔట్ నుంచి 30 అడుగుల రోడ్డును వదిలినట్లు చెప్పారు. 1992లో అప్పటి గ్రామ పంచాయతీ అనుమతి ద్వారా లేఔట్ అప్రూవల్ పొందినట్లు తెలిపారు. అప్పట్లో పక్కన ఉన్న భూముల్లో ఎలాంటి లేఔట్లు లేవని చెప్పారు. కాలానుగుణంగా సింగాపూర్ ప్రాంతంలోని ప్లాట్లకు డిమాండ్ పెరగడంతో పుట్టగొడుగుల్లా కొత్త లేఔట్లు వెలిశాయన్నారు. ఓ బడా వెంచర్ దారుడు పెద్దమొత్తంలో లేఔట్ చేసి తమ వెంచర్‌కు ఆనుకొని ఉన్న బండ్ల బాటను కూడా కబ్జాచేసి చుట్టూ ప్రహరీ కట్టినట్లు ఆరోపించారు. సర్వేనెంబర్ 51 నుంచి సర్వేనెంబర్ 52లోని 30అడుగుల రోడ్డు ద్వారా శంకర్‌పల్లి ఓడీఎఫ్‌కి ఉన్న దారిని కూడా కబ్జా చేసినట్లు చెప్పారు. బండ్ల బాట కబ్జాకు గురైన విషయాన్ని కలెక్టర్, చేవెళ్ల ఆర్డీవో, ఎంపీ, స్థానిక తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇటీవలే ఆర్డీవో చంద్రకళకు బండ్ల బాట కబ్జా విషయాన్ని వివరించగా.. కమిషనర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. కమిషనర్ విచారణలో భాగంగా గ్రామ నక్ష తెప్పించుకుని పరిశీలించగా బండ్ల బాట కబ్జాకు గురైనట్లు గుర్తించడం జరిగిందని తెలిపారు. బండ్లబాటను యధావిధిగా వదలాలని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఓడీఎఫ్ ఉద్యోగులు శ్రీనివాస్, ఎం.అర్జున్, సురేష్, ప్రతాప్‌రాజు ఉన్నారు.

హెల్మెట్ తప్పక ధరించాలి : సీఐ


యాచారం : మీర్‌ఖాన్‌పేటలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

యాచారం, జూలై 3(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు సూచించారు. గురువారం మీర్‌ఖాన్‌పేటలో వాహనాలు తనిఖీ చేశారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులుంటాయన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

మంచాల, జూలై 3(ఆంధ్రజ్యోతి): తొందరబాటుకు గురికాకుండా అప్రమత్తంగా ఉంటే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమౌతుందని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఆఫీసర్ నర్సింగ్‌రావు సూచించారు. రాచకొండ కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మంచాల మండలం ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలలో గురువారం డ్రైవింగ్ లైసెన్స్, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అధికారులు నర్సింగ్‌రావు, సోమనాథ్, సంతోష్‌లు పాల్గొని రోడ్డు ప్రమాదాలు జరిగే తీరు, మద్యపానం చేసి వాహన డ్రైవింగ్ వల్ల కలిగే అనర్థాలు, లైసెన్స్ పొందడం, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వెంబడి

(ఐదో పేజీ తరువాయి)

నందిగామ, మామిడిపల్లి, నర్సప్పగూడ, అంతిరెడ్డిగూడ తదితర గ్రామాల్లో అదనపు భవన నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. నందిగామ మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఉర్దూ మీడియం పాఠశాల భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. భవనం అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులకు వరండాలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో వర్షాకాలం, వేసవిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అన్ని పాఠశాలల్లోనూ అంతే..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు సరైన సదుపాయాలతో వంటశాలలు లేకపోవడం, ఉన్నా ఇరుకుగా ఉండడం, కొన్ని చోట్ల అస్సలే లేకపోవడంతో ఆరుబయటే నిర్వాహకులు వంటలు చేస్తూ విద్యార్థులకు భోజనం అందిస్తున్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

ఒకే గదిలో అన్ని తరగతులు

మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలకు సరైన సదుపాయాలతో తరగతి గదులు లేవు. ఇరుకు గదుల్లోనే విద్యార్థులకు విద్యా బోధన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని మంచెన్‌పాడు, బెండకుంట తండా, అంతిరెడ్డి గూడ ప్రాథమిక పాఠశాలలకు ఒకే తరగతి గది ఉండడంతో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులను ఒకే గదిలో కూరోచబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. బడిబాట కార్యక్రమం నిర్వహించినా ఒకే విద్యార్థి, ఒకే ఉపాధ్యాయుడితో పిట్టలగూడ ప్రాథమిక పాఠశాల కొనసాగుతుండడం విస్మయానికి గురి చేస్తుంది.


నందిగామ ప్రభుత్వ పాఠశాలలో నత్తనడకన సాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులు

విద్యార్థులకు తప్పని నడక

మండలంలోని అంతిరెడ్డిగూడ, అప్పారెడ్డిగూడ, చంద్రాయన్‌గూడ, జంగోనిగూడ, పిట్టలగూడ, బండకుంట తాండా, చిన్నకుంటతండా గ్రామాల్లో ప్రాథమిక పాఠశాల వరకే ఉండడంతో ఉన్నత పాఠశాల కోసం విద్యార్థులు నందిగామ ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. వీర్లపల్లి, బండోనిగూడ, బుగ్గోనిగూడ, వెంకమ్మగూడ, తాళ్లగూడ తదితర గ్రామాల్లోనూ ప్రాథమిక పాఠశాల వరకే ఉండడంతో విద్యార్థులు కిలోమీటర్ల దూరంలో ఉన్న చేగుర్‌కు వెళ్లి చదువుకుంటున్నారు. అలాగే మొదళ్లగూడ, మజీద్ మామిడిపల్లి, మంచన్‌పాడు, శ్రీనివాసులగూడ, ఈదులపల్లి, మొత్కుళ్లగూడ విద్యార్థులు ఉన్నత పాఠశాల కోసం మామిడిపల్లి వచ్చి విద్యనభ్యసిస్తున్నారు. కనీసం బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో కిలోమీటర్ల దూరం ఎండ, వానల్లోనూ నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఒకటీ రెండుకు ఆరుబయటే..

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆరు బయటకు పరుగులు తీస్తున్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు సమస్యలను గుర్తించి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కేశంపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): లింగంధన గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి కాంగ్రెస్ నాయకుడు బండెల రాజేందర్ రెడ్డి రూ. 1,00,116 విరాళం అందించారు. గురువారం గ్రామస్తులతో కలిసి ఆలయ నిర్మాణాన్ని పరిశీలించి కమిటీ సభ్యులకు నగదు ఇచ్చారు. లక్ష్మీనర్సింహారెడ్డి, చిన్న రామస్వామి, కృష్ణయ్య, జంగయ్య, సురేందర్, రాములు, వినయ్, ఇస్తారి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి : ఏబీవీపీ

కడ్తాల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్ షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం కడ్తాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు క్యామ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రధాన రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు పవన్, రమేశ్, సందీప్, హరీశ్‌గౌడ్, హేమంత్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ప్రమాదకర ఇళ్లను తొలగించాలి

ఆమనగల్లు, జూలై 3(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో శిథిలావస్థకు చేరిన ప్రమాదకర ఇళ్లు, కట్టడాలను యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కమిషనర్ శంకర్‌నాయక్ కోరారు. ఈమేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ప్రమాదకర భవనాలు తొలగించుకోవాలని కోరారు.

బీజేపీ చీఫ్‌కు నాయకుల సన్మానం



రాంచందర్‌రావును సన్మానిస్తున్న బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్/కేశంపేట/చేవెళ్ల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌రావును గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్‌గౌడ్‌తో కలిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డిలు హైదరాబాద్‌లో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఏపీ అధ్యక్షుడిగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌ను నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి సన్మానించారు. బీజేపీ జాతీయ ఏబీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్‌ను సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు విజయభాస్కర్, ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, పసుల నర్సింహ యాదవ్, సుధాకర్, బలవ్వంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, హరిభూషన్, కురుమయ్య, పసుల ప్రశాంత్, రఘురాములు గౌడ్, మోటి శ్రీను, జమ్ముల నర్సింహ, కృష్ణయ్య, విజయ్ శంకర్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు. బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు, కేశంపేట మండల పోమాల్‌పల్లికి చెందిన కంచుకోట మహేష్ రాంచందర్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు. చేవెళ్ల మండల నాయకులు మాజీ ఎమ్మెల్యే రత్నం, వైభవ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అనంతరెడ్డి, శ్రీకాంత్, సర్వలింగం, నాగరాజులు రాంచందర్ రావును సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

శంషాబాద్ రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల నాయకులు జగ్గల సామ్యేల్ పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం శంషాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు కార్మికులతో కలిసి ఆయన సమ్మె నోటీసు అందించారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం కొనసాగిస్తామన్నారు. సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి నాగేశ్, మండల మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షురాలు యాదమ్మ, ఇందిర, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీల సాధనకు సమన్వయంతో ముందుకు సాగాలి

ఆమనగల్లు, జూలై 3(ఆంధ్రజ్యోతి):ఉత్తమ పంచాయతీల సాధనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని మండల ప్రత్యేక అధికారి శోభారాణి కోరారు. ఉత్తమ పంచాయతీ అవార్డులకు ఎంపికయ్యే లక్ష్యాల సాధనలో ఎక్కడా కూడా అలసత్వానికి తావివ్వకూడదని సూచించారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉత్తమ గ్రామ పంచాయతీల ఎంపిక, స్వచ్ఛ సర్వేక్షణ్‌పై వివిధ శాఖల అధికారులకు 9 అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో కుసుమ మాధురి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి స్పెషలాఫీసర్ శోభారాణి హాజరయ్యారు. నిర్దేశించిన అంశాల సాధనకు ఆమె పలు సూచనలు చేశారు. 9 అంశాలతో కూడిన ఫార్మాట్ పూర్తిపై కార్యదర్శులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

యాచారం : మండలంలోని మరిన్ని గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే జాతీయ అవార్డులను దక్కించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మండల ప్రత్యేకాధికారి మాధవరావు, ఎంపీడీవో రాధారాణిలు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. వివిధ గ్రామాలకు 2023-24లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేసిన అభివృద్ధి పనుల రికార్డులను పరిశీలించి నివేదికలు తయారు చేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, స్వచ్ఛ సర్వేక్షణ్‌ను పకడ్బందీగా చేపట్టాలన్నారు. త్వరలో ఎమ్మెల్యే రంగారెడ్డి చేతుల మీదుగా హరితహారం మొక్కలు నాటించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంక్షిప్తంగా..

కేశంపేట : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదోడి సొంతింటి కల సాకారమవుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బీసా కరుణాకర్ రెడ్డి అన్నారు. తొమ్మిదిరేకులలో గురువారం ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. బీసీ సెల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుత్తి శేఖర్, నాయకులున్నారు.

మొయినాబాద్ రూరల్ : తెలంగాణలోని మాదిగల ఆత్మగౌరవ ప్రతీక ఎమ్మార్పీఎస్ అని మొయినాబాద్ మండలాధ్యక్షుడు కొండిగారి మహేందర్ అన్నారు. అమ్డాపూర్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దిమ్మె ఏర్పాటుకై భూమిపూజ చేశారు. మహేందర్ మాదిగ, దారుగుపల్లి రాజు, కిరణ్ మాదిగ, శ్రీను మాదిగ, జంగయ్య మాదిగ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కడ్తాల్ : మండలం మక్తమాదారంలో ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మె నిర్మాణానికి భూమిపూజ చేశారు. జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ, మండలాధ్యక్షుడు రమేశ్ మాదిగలతో కలిసి మాజీ సర్పంచ్ సులోచన సాయిలు కార్యక్రమం ప్రారంభించారు.

చేవెళ్ల : విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని బీఆర్ఎస్వీ నాయకులు అన్నారు. మండల పరిధిలోని గొల్లపల్లి వద్ద గల గురుకుల పాఠశాలలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. తరగతి, వంట గదులు, మరుగుదొడ్లు పరిశీలించారు. నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారని, విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటే బాధ్యులు ఎవరని నాయకులు అన్నారు. ప్రభుత్వం తక్షణమే గురుకులం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు పృథ్వీరాజ్, రవికుమార్, ఆసిఫ్, భాస్కర్, కార్తీక్, అమాన్, సైఫ్‌అలీఖాన్, అనిల్ ఉన్నారు.

కడ్తాల్ : సామాజిక సేవా కార్యక్రమాల నిర్వాహణలో లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో అగ్రభాగాన నిలిచిందని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ జి. మహేంద్రకుమార్‌రెడ్డి, మాజీ గవర్నర్ జి. చెన్నకిషన్ రెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ బాలాజీ నగర్ సభ్యురాలు హరితారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి.. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. మహేంద్రకుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ లింగయ్య, క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, తదితరులతో కలిసి కార్యక్రమం ప్రారంభించారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పాపం.. కమలమ్మ

- ఇందిరమ్మ ఇంటి పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో మృతి


కమలమ్మ మృతదేహం

కందుకూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని లేమూరులో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లేమూరు గ్రామానికి చెందిన గుర్వీ కమలమ్మకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. దాంతో పాత ఇల్లు కూల్చివేసి కొత్తగా ఇల్లు కట్టుకుంటోంది. ఈక్రమంలో గురువారం కొత్త ఇంటికి నీరు పట్టడం కోసం పాత ఇంటి గేటు తీస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురైంది. దాంతో ఆమె మృతిచెందింది. అయితే, గేటుకు విద్యుత్ వైర్ తగిలిన విషయం గమనించకుండా తాకడంతో విద్యుదాఘాతానికి గురైంది. ఆమె మృతి పట్ల కుటుంబికులు లబోదిబోమని రోధించారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

షాద్‌నగర్ రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు. 45 నుంచి 50 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి సోలీపూర్ శివారులోని రైల్వే కల్వర్టులో గురువారం సాయంత్రం 3గంటల సమయంలో జారిపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి శరీరంపై తెల్లరంగు ఫుల్ షర్ట్, గ్రేకలర్ ప్యాంట్, మెడలో నాలుగు తాయత్తులు ఉన్నట్లు తెలిపారు. షాద్‌నగర్ స్టేషన్ మాస్టర్ ఠాగూర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసినవారు-9848090426 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంలో పోటీపడాలి


ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, జూలై 3(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక, పరిశోధన రంగాలలో ప్రపంచంతో పోటీపడాలని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఆమనగల్లు, వెల్దండ మండలాల్లో గురువారం సుంకిరెడ్డి పర్యటించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5నుంచి 13వరకు కల్వకుర్తిలో నిర్వహించే మెగా వైద్యశిబిరం విజయవంతంపై ఆమనగల్లు ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల నాయకులు, ఫౌండేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వెల్దండ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం ఫౌండేషన్ ద్వారా 8ల్యాప్‌టాప్‌లను సమకూర్చి సుంకిరెడ్డి అందజేశారు. ఆయన్ను ప్రిన్సిపాల్, టీచర్లు సత్కరించారు. ప్రిన్సిపాల్ స్వర్ణరత్నం, నాయకులు దశరథ్‌నాయక్, మురళి, లాలు, నర్సింగ్, తదితరులు ఉన్నారు.


గీత కార్మికుల సంక్షేమానికి పెద్దపీట


ఈత వనాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల సంక్షేమం, వృత్తి రక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీపీసీసీ సభ్యుడు, గౌడ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో గీత కార్మికుడు శేషయ్యగౌడ్ పెంచుతున్న ఈత వనాన్ని గురువారం ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్‌తో కలిసి శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్లు గీత కార్మికుల సంక్షేమంతో పాటు, అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదారం యాదగిరిగౌడ్, బాలయ్యగౌడ్, నరేశ్‌గౌడ్, నర్సింహగౌడ్, శ్రీరాములు గౌడ్, వెంకటేశ్‌గౌడ్, సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'సహకార సంఘాల' అధ్యక్షుడిగా జగన్‌మోహన్‌రెడ్డి

- ఉపాధ్యక్షుడిగా రమేష్


జగన్‌మోహన్‌రెడ్డి


రమేష్

షాద్‌నగర్ అర్బన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నియోజక వర్గంలోని శ్రీ రామలింగేశ్వర సహకార సంఘాల సమితి అధ్యక్షుడిగా అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన గుంటుక జగన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎల్కుర్తి రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నాగిళ్ళ కుమారస్వామి, సీఈవో వంతంగి సంపత్‌కుమార్‌ల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 50 గ్రామ సంఘాల అధ్యక్షులు కలిసి ఏకగ్రీవంగా తొమ్మిది మంది తాలుకా స్థాయి కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. వారిలో జగన్‌మోహన్‌రెడ్డిని అధ్యక్షుడిగా, ఎల్కుర్తి రమేష్‌ను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సభ్యులుగా ఇస్నాతి మహేందర్, పూజారి మల్లేష్, రాకల మల్లేష్, కటిక కృష్ణాజీ, ఎం.నర్సింహులు ఎన్నికైనారు. వీరు రెండేళ్లపాటు 50సంఘాల పనితీరును మేరుగు పరుస్తూ, ప్రజల అవసరానికి అనుగుణంగా రుణాలు ఇస్తూ, వ్యాపారాన్ని అభివృద్ధి పర్చాల్సి ఉంటుంది.

నిషేధిత భూముల వద్ద అడ్డుకట్టలు

చర్యలు తీసుకోవాలి : టెక్స్‌టైల్ పార్కు సభ్యులు

షాద్‌నగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నిషేధిత భూముల వద్ద అక్రమ అడ్డుకట్టలను అడ్డుకోవాలని హైదరాబాద్ హైటెక్ టెక్స్‌టైల్ పార్కు సొసైటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం బోర్డు సభ్యులు ఒక ప్రకటన విడుదల చేశారు. చేగూరు రెవన్యూ డివిజన్ పరిధిలో 142 ఎకరాల్లో ఉన్న టెక్స్‌టైల్ పార్కు స్థలాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న కారణంగా.. రాష్ట్ర ప్రభుత్వం ఆ భూముల క్రయ, విక్రయాలకు సంబంధించి ధరణిలో నిషేధిత జాబితాలో పెట్టిందని పేర్కొన్నారు. టెక్స్‌టైల్ పార్కు సొసైటీలో సభ్యులుగా ఉన్న పలువురు సభ్యులకు తెలియకుండా ఈ భూములను అక్రమంగా అమ్ముకునేందుకు కొందరు ఇతర వ్యక్తులకు విక్రయించేందుకు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారని, ఈ విషయం తెలిసి రెండు వారాల క్రితం టెక్స్‌టైల్ పార్కు భూముల వద్ద తాము ఆందోళన చేపట్టామన్న విషయాన్ని గుర్తుచేశారు. గురువారం కొందరు వ్యక్తులు టెక్స్‌టైల్ పార్కు స్థలాల్లో సమీపంలో ఏర్పాటు చేసిన మూడు గేట్ల వద్ద జేసీబీలతో పెద్దఎత్తున మట్టిని తరలించి గేట్లకు అడ్డుకట్ట వేశారని తెలిపారు. నిషేధిత భూముల గేటు తాళాలను పగులగొట్టి దారికి అడ్డంగా పెద్దఎత్తున అడ్డుకట్టలు వేయడంలో ఆంతర్యమేమిటని సొసైటీ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. తాము కూడా త్వరలోనే టెక్స్‌టైల్ పార్కు వద్ద పెద్దఎత్తున ఆందోళన నిర్వహించనున్నట్లు సొసైటీ సభ్యులు శ్రీరాములు తెలిపారు.

మార్కెట్ కమిటీ కార్యదర్శిపై దాడి హేయం

ఆమనగల్లు, జూలై 3(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్‌పై అదే మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ దాడి చేయడం హేయమని, ఆమనగల్లు ఏఎంసీ అధికారులు, సిబ్బంది అన్నారు. ఈమేరకు వారు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర మార్కెట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింహ, కార్యదర్శి ముకురంల ఆదేశానుసారం గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.